సాక్షి
కుమురం భీం
బుధవారం । 24 । జూలై । 2024



నల్లసూర్యులకు మళ్లీ నిరాశే

కేంద్ర బడ్జెట్‌లో బొగ్గు గని కార్మికులకు నిరాశే మిగిలింది. ఆదాయ పన్నుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపింది. IIలో ▸



గదుల కేటాయింపు ఎప్పుడో..?

బెల్లంపల్లిలో సమీకృత కూరగాయల మార్కెట్ పనులు కొనసాగుతున్నాయి. సిద్ధం చేసిన స్టాల్స్ కేటాయించాలని వ్యాపారులు కోరుతున్నారు. IIలో ▸

గరిష్టం/కనిష్టం
27.5 /24.4

వాతావరణం

ఆకాశం పూర్తిగా మేఘావృతమవుతుంది. అల్ప పీడనం, రుతుపవనాల ప్రభావంతో జిల్లా అంతటా ఈదురు గాలులతో వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పదోన్నతితో మరింత బాధ్యత



సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: పదోన్నతితో ఉద్యోగులపై మరింత బాధ్యత పెరుగుతుందని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో పదోన్నతి పొందిన పలువురు పోలీసు సిబ్బందిని మంగళవారం అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ మరిన్ని పదోన్నతులు పొందాలన్నారు. మహ్మద్ బషీరుద్దీన్, గులాం మక్సుద్ హెడ్‌కానిస్టేబుల్ నుంచి ఏఎస్సైలుగా, నాగరాజు, తిరుపతి కానిస్టేబుల్ నుంచి హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందారు. కార్యక్రమంలో సీఐలు సతీశ్, రాంబాబు, ఆర్‌ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు ఎంవీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ పథకంలో అర్హత కలిగిన వారికి ఇబ్బందులు రానీయొద్దని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకును మంగళవారం సందర్శించి రుణమాఫీ పథకం అమలు తీరును పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ రూ.లక్ష లోపు రుణం తీసుకున్న రైతుల ఖాతాల్లో నిధుల జమపై దృష్టి సారించాలన్నారు. ఎలాంటి షరతులు విధించకుండా నిబంధనల మేరకు రుణ మొత్తాన్ని రైతులకు చెల్లించాలని బ్యాంకు సిబ్బందికి సూచించారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ వి.జోషి, తహసీల్దార్ దేశ్‌పాండే, సిబ్బంది ఉన్నారు.

సెలవుల్లో ఉద్యోగి.. గర్భిణుల నిరీక్షణ



స్కానింగ్ కేంద్రం వద్ద గర్భిణులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన స్కానింగ్ కేంద్రానికి పరీక్షల కోసం వస్తున్న గర్భిణులకు తిప్పలు తప్పడం లేదు. వారంలో మూడు రోజులు మాత్రమే ఇక్కడ స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. గత వారం జిల్లాలోని కెరమెరి, జైనూర్, బెజ్జూర్, కాగజ్‌నగర్‌తోపాటు పలు మారుమూల ప్రాంతాల నుంచి 80 మంది గర్భిణులు స్కానింగ్ కోసం ఈ కేంద్రానికి వచ్చారు. రేడియాలజిస్టు కేవలం 40 మందికి మాత్రమే పరీక్షలు నిర్వహించి వెళ్లిపోయాడు. మిగిలిన వారు గంటల తరబడి నిరీక్షించి నిరాశతో వెనుదిరిగారు. తిరిగి వారు మంగళవారం స్కానింగ్ సెంటర్‌కు రాగా.. రేడియాలజిస్టు సెలవులో ఉన్నట్లు సిబ్బంది తెలిపారు. సెలవు విషయం తెలియని మహిళలు సుమారు గంట పాటు అక్కడే నిరీక్షించి ఇళ్లకు వెళ్లిపోయారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చెన్నకేశవను సంప్రదించగా.. పని ఒత్తిడి పెరగడంతో రేడియాలజిస్టు సెలవుపై వెళ్లారని తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ



క్యూలో '317 జీవో' ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్‌రూరల్: 317 జీవో కారణంగా ఇతర జిల్లాల నుంచి కుమురం ఆసిఫాబాద్ జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయులకు త్వరలో ఊరట లభించనుంది. జిల్లా కేంద్రంలోని జన్కాపూర్ ఉన్నత పాఠశాలలో ఇతర జిల్లాల నుంచి వచ్చిన టీచర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు డీఈవో అశోక్ తెలిపారు. 317 జీవోతో ఇతర జిల్లాల నుంచి 836 మంది జిల్లాకు రాగా 800 మంది సొంత జిల్లాకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సర్టిఫికెట్ పరిశీలన, స్థానికత, మెడికల్, ఇతర అంశాలను పరిశీలించామన్నారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. కాగా.. రాష్ట్రంలోనే అత్యధికంగా 317 జీవోతో ఇతర జిల్లాల నుంచి కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు ఉపాధ్యాయులు వచ్చారు.

యువతకు భరోసా!



- కేంద్ర బడ్జెట్‌లో నిరుద్యోగులకు పెద్దపీట
- పీఎం ప్యాకేజీ కింద ఉద్యోగ కల్పన, నైపుణ్యాభివృద్ధి
- ముద్ర రుణాల పరిమితి పెంపు
- వేతన జీవులకు కాస్త ఊరట
- నెరవేరనున్న పట్టణ పేదల సొంతింటి కల
- వెనుకబడిన జిల్లాల జాబితాలో 'ఆసిఫాబాద్'కు దక్కని చోటు

సాక్షి, ఆసిఫాబాద్: కేంద్ర ప్రభుత్వం 2024– 25 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వ్యవసాయ రంగంలో ఉత్పాదకతపై ప్రత్యేక దృష్టి సారించిన కేంద్రం.. యువతకు ఉద్యోగ కల్పన– నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యతను ఇచ్చింది. పట్టణ– గ్రామీణాభివృద్ధికి నిధులు కేటాయించింది. అలాగే పట్టణ పేదల సొంతింటి కల నెరవేరేలా బడ్జెట్‌లో కేటాయింపులు పెంచింది. పన్ను విధానంలో స్వల్ప మార్పుల ద్వారా వేతన జీవులకు కాస్త ఊరట లభించినా.. ఆశించిన స్థాయిలో లేదని ఉద్యోగులు నిరాశ పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని వెనుకబడిన జిల్లాకు ప్రత్యేక ప్యాకేజీ నిధులు కేటాయిస్తున్నట్లుగా దేశంలోనే అత్యంత వెనుకబడిన జిల్లాల్లో ఒకటైన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు ఎలాంటి ప్రయోజనాలు చేకూర్చకపోవడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. అలాగే జిల్లాకు సంబంధించిన రైల్వే స్టేషన్లు, జాతీయ రహదారుల అభివృద్ధి గురించి ప్రస్తావించలేదు.

వేతన జీవికి స్వల్ప ఊరట

కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ మంగళవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ మధ్యతరగతి ప్రజలకు భరోసా ఇచ్చేలా రైతులు, నిరుద్యోగులు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, పట్టణ పేదలు, గ్రామీణాభివృద్ధికి ఊతం చేకూర్చేలా నిధులు కేటాయించినప్పటికీ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులేమీ కేటాయించకపోవడంపై అధికార, విపక్ష నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బడ్జెట్‌లో ఉద్యోగులకు స్వల్ప ఊరటే లభించింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో కొన్ని మార్పులు మాత్రమే చేయగా.. పాత పన్ను విధానంలో మాత్రం ఎలాంటి మార్పులు చేయకపోవడమే ఇందుకు కారణం. కొత్త పన్ను విధానంలో పన్ను శ్లాబుల్లో మార్పుతోపాటు, స్టాండర్డ్ డిడక్షన్ మొత్తాన్ని రూ.50 వేల నుంచి రూ.75 వేలకు పెంచింది. వేతన జీవికి రూ.17,500 వరకు పన్ను ఆదా చేసుకునే అవకాశం లభించినట్లయింది. అలాగే రూ.3 లక్షల వరకు ఎలాంటి పన్నూ ఉండదు. రూ.3లక్షల నుంచి రూ.10 లక్షల వరకు గతంలో ఉన్న పన్ను శ్లాబుల్లో స్వల్ప మార్పులు జరగడం మినహా ఆశించిన స్థాయిలో పన్ను శ్లాబుల్లో మార్పులు జరగపోవడంపై వేతన జీవులు నిరాశ చెందారు.

సొంతింటి కల నిజం చేసేలా..

ప్రధాన మంత్రి ఆవాస్ యోజనకు బడ్జెట్‌లో రూ.2.2 లక్షల కోట్ల మేర సాయాన్ని ప్రతిపాదించడంతో జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణ పేదలతోపాటు, గ్రామీణ ప్రాంతాల్లోని ఇల్లు లేని పేదలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉన్నట్లు జిల్లా అధికారులు అభిప్రాయపడుతున్నారు.

నిరుద్యోగుల్లో ఆశలు

'పీఎం ప్యాకేజీ' పథకం కింద ఉద్యోగ కల్పన– నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధికి ప్రాధాన్యత ఇవ్వడంతో కొత్త ఉద్యోగాల కల్పనకు కేంద్రం బాటలు వేసినట్లయింది. ఎంప్లాయిమెంట్ లింక్డ్ స్కీమ్ ఇందుకు దోహదం చేయనుంది. సంఘటిత రంగంలో కొత్తగా ఉద్యోగంలో చేరే వారికి తొలి జీతం కేంద్రమే భరిస్తుందని ప్రకటించడంపై నిరుద్యోగుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే ఇంటర్న్‌షిప్ అవకాశం కల్పిస్తుడటం నిరుద్యోగులకు కలిసొచ్చే అంశం. జిల్లాలో ఎంప్లాయిమెంట్ శాఖ లెక్కల ప్రకారం నిరుద్యోగుల సంఖ్య 2852 కాగా.. వీరు కేంద్ర బడ్జెట్ ద్వారా తమ తలరాతలు మారుతాయన్న ఆశలతో ఉన్నారు.

రుణాల జల్లు

స్వయం ఉపాధి పొందుతున్న చేతివృత్తి మహిళలు, చిరు వ్యాపారులకు ఇచ్చే రుణాలను పెంచుతున్నట్లు ప్రకటించారు. గతంలో ముద్ర రుణాల ద్వారా రూ.10 లక్షల వరకు రుణాలు లభించేవి. కొత్త బడ్జెట్‌లో వీటి రుణపరిమితి పెంచారు. తాజాగా రూ.20 లక్షల వరకు రుణాలు పొందేలా బడ్జెట్‌లో ప్రతిపాదించారు. రుణాల ద్వారా జిల్లాలోని మొత్తం 8002 డ్వాక్రా గ్రూపులతోపాటు వీధి వ్యాపారులకు భరోసా లభించనుంది. మైనర్ల కోసం ఎన్‌పీఎస్ వాత్సల్య పేరుతో న్యూపెన్షన్ స్కీం ప్రకటించారు. మైనర్ల పేరుపై తల్లిదండ్రులు ఖాతా తెరిచి నగదు పొదుపు చేయవచ్చు.

చిరువ్యాపారులకు అనుకూలం



కేంద్ర బడ్జెట్ మధ్య తరగతికి భరోసా కల్పించేలా ఉంది. చిరువ్యాపారులకు అనుకూలంగా ఉంది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ఆర్థిక సహాయం, ఎంఎస్ఎంఈ క్లస్టర్లు, నూతన సీడీబీ బ్యాంకు బ్రాంచీల ఏర్పాటు చేయడం యువతకు ఉపయోగపడుతుంది.

– అవుదపు ప్రణయ్, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు

పేదల వ్యతిరేక బడ్జెట్



ఆసిఫాబాద్: కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలాసీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ భారత బడ్జెట్‌లా లేదు. తెలంగాణ, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు నిధుల కేటాయింపులో వివక్షత చూపుతూ ఆంధ్రప్రదేశ్, బిహార్‌కు పెద్దపీట వేశారు. వికసిత్ భారత్ కాదు.. వికసిత్ ఆంధ్రప్రదేశ్‌లా ఉంది. బంగారం, వెండిపై కస్టమ్స్ సుంకం తగ్గించడం, నిత్యావసర వస్తువులు, ఎరువులపై సుంకం పెంచడం సరికాదు. రక్షణ రంగానికి, విద్యకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు.

– కొక్కిరాల విశ్వప్రసాదరావు, డీసీసీ అధ్యక్షుడు

విద్యారంగానికి మొండిచేయి



ఆసిఫాబాద్‌రూరల్: బడ్జెట్‌లో విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపింది. బడ్జెట్‌లో కేవలం 3.06 శాతం మాత్రమే నిధులు కేటాయించడంతో విద్యార్థి లోకానికి తీవ్ర నిరాశను మిగిల్చారు. యువతకు ఉపాధి, నైపుణ్యానికి పెద్దపీట పేరుతో కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అవసరాలను తీర్చే మానవ వనరులను తయారు చేసేందుకు కుట్ర చేస్తోంది. అత్యంత వెనుకబడిన జిల్లాకు కేంద్ర విద్యా సంస్థలను కేటాయించలేదు.

– సాయికృష్ణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

ఆమోదయోగ్యంగా ఉంది



బడ్జెట్ వ్యాపారులకు ఆమోదయోగ్యంగా ఉంది. గతంలో రూ.10 లక్షల వరకు పరిమితి ఉన్న ముద్ర లోన్లను రూ.20 లక్షలకు పెంచారు. చిరు వ్యాపారులకు ఎంతో ఊరట లభిస్తుంది. పేదలకు ఉచిత బియ్యం ఐదేళ్లపాటు కొనసాగించడం అభినందనీయం. జాతీయ రహదారులకు పెద్దపీట వేయడం దేశాభివృద్ధికి నిదర్శనం. యువత కోసం ఐదు పథకాలతో ప్యాకేజీ ఇవ్వడం, కోటి ఇళ్లకు సోలార్ ప్యానల్ ద్వారా ఉచిత విద్యుత్ అందించడం అభినందనీయం.

– గుండ ప్రమోద్, కిరాణా మర్చెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

నాణ్యమైన వైద్య సేవలందించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



పీహెచ్‌సీలో మందులు పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, తదితరులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని మంగళవారం డీఎంహెచ్‌వో తుకారాంతో కలిసి సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూం, మందుల గదిని పరిశీలించి రికార్డులు తనిఖీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు వైద్యసిబ్బంది నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని, ప్రతిఒక్కరూ సమయపాలన పాటించాలన్నారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహించి అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో క్రిటికల్‌గా ఉన్న కేసులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి పంపించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుకు పంపించవద్దన్నారు. మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సూచిస్తున్నాడని రోగులు తెలపడంతో వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు ప్రజలు చేరినప్పుడే నిజమైన సంక్షేమం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో తహసీల్దార్ జ్యోత్స్న, ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్, వైద్యాధికారి సుజిత్, వైద్యసిబ్బంది వెంకటేశ్వర్లు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలతో ప్రభుత్వ విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన విద్య అందుతుందని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. మండలంలోని కైరిగాం ప్రాథమికోన్నత పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మూత్రశాలలు, వంటశాలతోపాటు ఇతర వసతులను కల్పిస్తున్నామన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఆయన వెంట డీఆర్‌డీవో సురేందర్, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, ఎంపీడీవో శంకరమ్మ, ఎంపీవో రాజేశ్వర్, ఏపీఎం వెంకటరమణ శర్మ తదితరులు ఉన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్‌రూరల్: వర్షాకాలంలో ప్రజల రక్షణ కోసం అన్నివేళల్లో అందుబాటులో ఉంటామని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. పట్టణంలోని నౌగాంబస్తీలో వర్షాల కారణంగా పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లను మంగళవారం పరిశీలించారు. అభివృద్ధితోపాటు ప్రజల సంక్షేమం కోసం అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రక్షణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. లోతట్టు వరద ప్రభావిత ప్రాంతాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. దెబ్బతిన్న ఇళ్ల పూర్తి వివరాలతో నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి గదులు, పాఠశాల ఆవరణ, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో సురేశ్, మున్సిపల్ కమిషనర్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



కేజీబీవీ పరిసరాలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి, తదితరులు

ట్యాంకర్ ద్వారా తాగునీటి సరఫరా



ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్న అధికారులు

- పీకలగుండం గ్రామాన్ని సందర్శించిన డీఎల్‌పీవో

సాక్షి ఎఫెక్ట్

దహెగాం(సిర్పూర్): తాగునీటి కోసం దహెగాం మండలం పీకలగుండం గ్రామస్తులు పడుతున్న అవస్థలపై మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన 'తాగునీటికి ప్రాణాలు పణం' అనే వార్తకు డీఎల్‌పీవో సురేశ్‌బాబు స్పందించారు. మంగళవారం పీకలగుండం గ్రామాన్ని సందర్శించి స్థానికులకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీళ్ల కోసం వాగుకు వెళ్లొద్దని సూచించారు. మరో రెండు రోజుల్లో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఎర్రవాగుకు వెళ్లే దారిని చీరలు కట్టి మూసివేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఉన్నారు.

పల్లెలపై దోమ కాటు!

- జిల్లాలో ఎడతెరిపి లేకుండా వానలు
- గ్రామీణ ప్రాంతాల్లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం
- ఫాగింగ్ చర్యలు లేక వృద్ధి చెందుతున్న దోమలు
- మంచం పడుతున్న గ్రామాలు
- ఇప్పటికే రెండు డెంగీ, ఏడు మలేరియా పాజిటివ్ కేసులు



కౌటాలలో ఓపెన్ ప్లాట్ స్థలంలో నిలిచిన నీరు

కౌటాల(సిర్పూర్): జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలకు తోడు పారిశుధ్య లోపంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇళ్ల మధ్య రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. ఇప్పటికే కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, దహెగాం మండలాలతోపాటు పలు ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలు మంచం పడుతున్నారు. జ్వరం, కీళ్ల, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నారు.

63 సమస్యాత్మక గ్రామాలు

జిల్లాలోని 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న 63 సమస్యాత్మక గ్రామాలను వైద్యశాఖ గుర్తించింది. విస్తారమైన వర్షాలతో దోమలు విజృంభిస్తున్నారు. గ్రామీణ ప్రజలకు కునుకు లేకుండా చేస్తున్నాయి. మురుగునీటి కాలువ, జనావాసాలకు చేరువలో ఏర్పడిన గుంతలు వాటికి ఆవాసాలుగా మారాయి. దోమల కారణంగా జిల్లాలో ఇప్పటికే రెండు డెంగీ, ఏడు మలేరియా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. మరోవైపు ఆస్పత్రుల్లో వైద్యుల కొరత ఇబ్బందిగా మారుతోంది. జిల్లాలో 22 పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలకు 46 వైద్యపోస్టులు మంజూరయ్యాయి. ప్రస్తుతం 11 మంది మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో 47 మంది ఎంఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు)లు ఉన్నారు.


జాడలేని ఫాగింగ్

గ్రామ పంచాయతీల్లో నిధుల లేమితో డ్రెయినేజీల్లో పూడికతీత పనులు సక్రమంగా చేపట్టడం లేదు. నిత్యం మురుగునీరు నిలిచి ఉంటోంది. పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి పరిసరాలు చిత్తడిగా మారాయి. కనీసం వారంలో ఒకసారైనా దోమల నివారణకు ఫాగింగ్ ప్రక్రియ చేపట్టాల్సి ఉన్నా ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదు. యంత్రాలు పని చేయకపోవడంతోపాటు నిధుల కొరతతో వాటిని పంచాయతీ కార్యాలయాల్లోనే మూలన పడేశారు. దోమల నివారణకు ఒక్కో కుటుంబం నెలకు రూ.మూడు వందల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. వైద్యశాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు. పంచాయతీ అధికారులు ఫాగింగ్ నిర్వహించాలని వేడుకుంటున్నారు.

జాగ్రత్తలు అవసరం

- డెంగీ కారక దోమలు పిల్లలపై ఎక్కువగా దాడి చేస్తాయి. సాధ్యమైనంత వరకు కాళ్లు, చేతులు పూర్తిగా కప్పి ఉంచేలా దుస్తులు వేయాలి.
- పగలు నిద్రపోయే సమయంలో దోమతెరలు వినియోగించాలి. దోమల నియంత్రణకు కాయిల్స్ వాడాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పారిశుధ్య చర్యలు చేపట్టాలి.
- పూలకుండీలతో పాటు వాటి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి.
- పాఠశాలలు, వసతి గృహాల ఆవరణలో మురుగునీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ఫాగింగ్, యాంటీ లార్వా చర్యల ద్వా రా ఎప్పటికప్పుడు దోమలను నియంత్రించాలి. మంచినీటి ట్యాంకులపై కప్పులు వినియోగించాలి.
- అనారోగ్యం బారిన పడితే ఆలస్యం చేయకుండా సమీపంలోని ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవాలి.

వైద్యశిబిరాల ఏర్పాటు



జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో మలేరియా, డెంగీ, టైఫాయిడ్, జలుబు, వాంతులు, విరేచనాలు వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. దోమలు పెరగకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కాచి చల్లార్చిన నీటిని తాగాలి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. ప్రతీ పీహెచ్‌సీలో ఒక రాపిడ్ రెస్పాన్స్ బృందం ఏర్పాటు చేశాం.

– డాక్టర్ నవత, డీడీవో

ఘనంగా దాశరథి శతజయంత్యుత్సవాలు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో మంగళవారం కవి దాశరథి శతజయంత్యుత్సవాలు నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, ఏఎస్ఆర్ మూర్తి, నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, ప్రతాప్‌సింగ్, రిటైర్డ్ ఉద్యోగులు ఉన్నారు.



గదుల కేటాయింపు ఎప్పుడో..?

- గ్రౌండ్‌ఫ్లోర్‌లో పూర్తయిన స్టాల్స్
- ఫస్ట్‌ఫ్లోర్‌లో కొనసాగుతున్న పనులు
- ఇంకా తేల్చని వ్యాపారుల జాబితా



కూరగాయల మార్కెట్ సముదాయం

బెల్లంపల్లి: పట్టణంలోని కాంటా చౌరస్తా సమీపంలో నిర్మించ తలపెట్టిన సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మరోవైపు గ్రౌండ్‌ఫ్లోర్‌లో సిద్ధం చేసిన స్టాల్స్‌ను తక్షణమే కేటాయించాలని వ్యాపారులు ఆరాట పడుతున్నారు. కొద్ది నెలల క్రితమే స్టాల్స్ కేటాయిస్తారనే ప్రచారం జరగగా ఎప్పటికప్పుడు వాయిదా పడుతోంది. ఇప్పటికే కూరగాయల వ్యాపారులతో రెండు దఫాలు చర్చలు జరిపినా సమస్య కొలిక్కిరాలేదు. రెండు పర్యాయాలు కలెక్టర్ కూరగాయల మార్కెట్‌ను సందర్శించి కూరగాయల వ్యాపారులు ఇబ్బంది పడకుండా సత్వరంగా స్టాల్స్‌ను కేటాయించేందుకు యత్నాలు చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈక్రమంలో కేటాయింపుల అంశం ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడినట్లు వ్యాపారులు చెబుతుండగా తాజాగా మరోమారు వాయిదాకు యత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. స్టాల్స్ కేటాయింపు అంశాన్ని మరోసారి వాయిదా వేయడాన్ని నిరసిస్తూ మంగళవారం వ్యాపారులు మార్కెట్ బంద్ పాటించి నిరసన తెలిపారు. మున్సిపల్ ప్రజా ప్రతినిధుల మీద వొత్తిడి తీసుకు రావాలనే యోచనతో కూరగాయల క్రయ విక్రయాలను నిలిపివేసి ఐక్యతను చాటుకున్నారు.

వ్యాపారుల సర్వే జరిగినట్లేనా...!

మార్కెట్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల వ్యాపారులు ఏళ్ల తరబడి నుంచి కూరగాయల అమ్మకాలు చేస్తున్నారు. కొన్ని నెలల క్రితం వ్యాపారుల సర్వే చేపట్టగా అందులో కొందరి పేర్లు లేనట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ విషయమై మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్‌తో వ్యాపారులు ఇటీవల సమావేశం నిర్వహించి చర్చించారు. అర్హత కలిగిన వ్యాపారులకు స్టాల్స్‌ను కేటాయించాలనే డిమాండ్ వస్తోంది. కానీ కొంతమంది లోపాయికారిగా వ్యవహరిస్తుండటంతో వ్యాపారులకు నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ నేపథ్యంలోనే స్టాల్స్ కేటాయింపును ఉద్దేశ పూర్వకంగా వాయిదా వేస్తున్నారని కూరగాయల వ్యాపారులు అనుమానం వ్యక్తం చేశారు. మరోవైపు కూరగాయల వ్యాపారుల ఎంపిక ఆగస్టు మొదటి వారంలో చేపట్టి, మార్కెట్‌ను ప్రారంభిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత ప్రకటించినప్పటికీ మార్కెట్ బంద్ వాయిదాకు వ్యాపారుల నుంచి సానుకూలత కనిపించ లేదు.

గ్రౌండ్‌ఫ్లోర్ పూర్తి

రూ.7 కోట్ల అంచనాతో ఆధునిక వసతులతో సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టారు. 2020లో జీ ప్లస్–1 భవన నిర్మాణ పనులను ప్రారంభించగా ప్రస్తుతం గ్రౌండ్‌ఫ్లోర్ పనులు పూర్తయ్యాయి. ఈ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌ను కూరగాయల వ్యాపారులకు, మొదటి అంతస్తులో మాంసాహారం, చేపలు, చికెన్ అమ్మకాలకు కేటాయించాలని నిర్ణయించారు. అయితే వివిధ కారణాలతో ఇప్పటి వరకు సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండగా ఇటీవల మళ్లీ పునఃప్రారంభమయ్యాయి. గ్రౌండ్‌ఫ్లోర్‌లో 108 కూరగాయల స్టాల్స్, 28 షెట్టర్లను నిర్మాణం చేసి సిద్ధంగా ఉంచారు. అయితే మొదటి అంతస్తులో స్టాల్స్ నిర్మాణం పనులు పూర్తి కావడానికి మరికొంత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాపారులు నిర్వహించిన మార్కెట్ బంద్ ఎంతగానో ప్రభావం చూపింది.

బంద్ విజయవంతం



నిర్మానుష్యంగా కనిపిస్తున్న షెడ్లు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలో కూరగాయల మార్కెట్ స్టాల్స్‌ను కేటాయించడంలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా వ్యాపారులు మంగళవారం మార్కెట్ బంద్ పాటించారు. హోల్ సేల్, మారు బేరం వ్యాపారులతో పాటు గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వ్యాపారులు బంద్‌కు మద్దతుగా నిలవడంతో కూరగాయల మార్కెట్ బోసిపోయి కనిపించింది. షెడ్లన్నీ నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. కూరగాయలు అందుబాటులో లేక పోవడంతో పురప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

గదులు సిద్ధంగా ఉన్నాయి

కూరగాయల మార్కెట్‌లోని గ్రౌండ్‌ఫ్లోర్‌లో గదుల నిర్మాణం పూర్తయ్యింది. ఈ ఫ్లోర్‌ను పూర్తిగా కూరగాయల వ్యాపారులకే ఇచ్చే అవకాశాలున్నాయి. వ్యాపారుల జాబితాను తయారు చేసి కేటాయింపులు ఎప్పుడు చేపట్టినా గదులు అప్పగించడానికి సిద్ధంగా ఉన్నాం. ఫస్ట్‌ఫ్లోర్‌లో సైతం పనులు నిర్వహిస్తున్నాం. త్వరలోనే పనులు పూర్తి కానున్నాయి.

– సందీప్, మున్సిపల్ ఏఈ, బెల్లంపల్లి

లాటరీ పద్ధతిలో విద్యార్థుల ఎంపిక

- కలెక్టర్ కుమార్ దీపక్



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్‌దీపక్

నస్పూర్: కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో కేంద్రీయ విద్యాలయం నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వార్షిక పరీక్షల్లో మెరుగైన ఫలితాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ప్రతీ నెల 9, 10 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులచే సమావేశం నిర్వహించాలన్నారు. డీఈవో యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, జిల్లా వైద్యాధికారి అనిత పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

రామకృష్ణాపూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి సంబంధించి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, చైర్‌పర్సన్ జంగం కళ, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రాణం తీసిన అతివేగం

- లారీని వెనకనుంచి ఢీకొట్టిన కారు
- ఘటనాస్థలిలోనే యువకుడు దుర్మరణం



అజయ్ (ఫైల్)

జైపూర్: త్వరగా ఇంటికి చేరాలన్న ఆత్రుతలో అతివేగంగా కారు నడుపుతూ లారీని ఢీకొట్టిన ఘటనలో యువకుడు మృతి చెందిన సంఘటన జైపూర్ మండలం ఇందారం రాజీవ్ రహదారిపై చోటు చేసుకుంది. ఎస్సై శ్రీధర్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామానికి చెందిన మచ్చ అజయ్ (24) జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని ఓ కారు షోరూంలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం విధులు ముగించుకున్నాక స్నేహితుడి కారులో మంచిర్యాల మీదుగా ఇంటికి వెళ్తుండగా ఇందారం సమీపంలోని దాబా వద్ద శ్రీరాంపూర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న లారీ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుకనుంచి ఢీకొన్నారు. దీంతో కారు ముందు భాగం లారీ కిందికి చొచ్చుకు పోవడంతో నుజ్జునుజ్జు అయ్యింది. కారు లోపల ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకున్నప్పటికీ అజయ్ కారు లోపలే ఇరుక్కుని అక్కడికక్కడే మృతి చెందాడు. క్రేన్ సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతదేహానికి మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని తండ్రి మచ్చ లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన



బెడ్‌లను పరిశీలిస్తున్న ఈశ్వరీబాయి

జన్నారం: కవ్వాల్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి సందర్శించారు. పాఠశాలలో తరగతి గదులు, వంట గది, కూరగాయలను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలోని సమస్యలను హెచ్‌ఎం శైలజ ఆమె దృష్టికి తీసుకెళ్లగా అధికారులతో మాట్లాడి పరిష్కారం అయ్యేలా చూస్తానన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ వివాదంపై ఫిర్యాదు



ఏసీపీకి ఫిర్యాదు చేస్తున్న నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ఎస్సీ కమ్యూనిటీ హాల్ వివాదంపై మంగళవారం దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు ఏసీపీ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. నలభై ఏళ్లక్రితం ప్రభుత్వ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ఇటీవల కొందరు ఓ వ్యక్తి వద్ద రూ.3 లక్షలకు తాకట్టు పెట్టారని వివరించారు. గోమాస రాజం అనే వ్యక్తి అభివృద్ధి పనుల పేరిట అప్పు ఇచ్చినట్లు, అప్పు తీరే వరకు కమ్యూనిటీ హాల్‌ను తన ఆధీనంలో ఉండేలా దస్తావేజు రాసుకున్నారని పేర్కొన్నారు. వెంటనే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం గోపాల్, రత్నం ఐలయ్య, కుంబాల రాజేశ్, బుర్స గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కొంపముంచిన 'రెట్టింపు' ఆశ !

- డబ్బులు డబుల్ చేస్తామని ఆన్‌లైన్‌లో రూ.కోట్లు సేకరణ
- విత్‌డ్రా చేయకుండా ఆప్షన్ ఎత్తేసిన ఓ యాప్ నిర్వాహకులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: తమ వద్ద డబ్బులు పెట్టుబడి పెడితే స్వల్ప కాలంలోనే రెట్టింపు అవుతాయని నమ్మించి ఓ విదేశీ ఇన్వెస్ట్‌మెంట్ యాప్ సంస్థ నట్టేట ముంచడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. గత కొద్ది రోజులుగా ఆన్‌లైన్ వేదికగా రూ.కోట్లలో పెట్టుబడుల రూపంలో ఖాతాల్లో జమ చేసుకుంది. ఆశతో యాప్‌లో పెట్టుబడి పెట్టిన డబ్బులే తిరిగి వచ్చేలా లేకపోవడంతో ఏం చేయాలో తెలియక పెట్టుబడిదారులు ఆందోళన చెందుతున్నారు. బాధితులు తెలిపిన ప్రకారం.. గత కొంత కాలంగా ఓ యాప్ సంస్థ మంచిర్యాల, ఆసిఫాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలతోపాటు రాష్ట్రంలో పలు చోట్ల స్వల్ప కాలంలోనే డబ్బును రెట్టింపు చేస్తామంటూ యాప్ సంస్థ విస్తృతంగా ప్రచారం చేసింది. చాలామంది ఆశపడి రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టారు. రోబోటిక్స్, ఏఐ, ఇంటెలిజెన్స్, డివిడెండ్లు, డేటా ప్రొడక్ట్స్, ఆయిల్ ఫ్యూచర్స్ ఇలా పలు రకాలుగా చెబుతూ రూ.300నుంచి రూ.2కోట్ల వరకు పెట్టుబడి పెట్టే అవకాశం ఇచ్చింది. పెట్టుబడిని బట్టి డబ్బు పెరుగుదల ఉంటుందని చెబుతూ, కనీసం ఒక రోజు నుంచి వారం, నెల, మూడు, ఆరు నెలలు, సంవత్సరం వరకు రెట్టింపు డబ్బులు పొందేలా గడువు విధించారు. మొదట కొందరికి వచ్చాయంటూ ప్రతీ వారాంతాల్లో పట్టణాలు, గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో సింగరేణి, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, మహిళలు, వ్యాపారులు భారీగా పెట్టుబడులు పెట్టారు. ఇందులో రెండు రోబోట్స్ రకం ప్రాడక్ట్స్ కొనుగోలు చేస్తే, ఒకే రోజులో పెట్టిన మొత్తానికి సమంగా రెట్టింపు అవుతాయని చెబితే, అనేక మంది ఈ ప్రొడక్ట్స్ కొనుగోలు చేశారు. తీరా నగదు విత్‌డ్రా చేసుకునే గడువు రాగానే విత్‌డ్రా ఆప్షన్ తీసేయడంతో పెట్టుబడిదారులు ఆందోళన చెందుతున్నారు. మంగళవారం యాప్‌లో అనేక మందికి డబ్బులు విత్ డ్రా చేసుకోవాల్సి ఉంది. నిర్వాహకులు పెట్టుబడిదారుల అకౌంట్ల ఐపీ అడ్రస్‌లు తేడా గుర్తించామంటూ చెబుతూ, మళ్లీ అకౌంట్లు యాక్టివ్ కావాలంటే డబ్బులు కట్టాలని ఓ నోటీసు పంపింది. ఆ డబ్బు కట్టకపోతే నకిలీ ఖాతాలుగా గుర్తిస్తామని పేర్కొంది. మళ్లీ అకౌంట్ యాక్టివ్ కోసం కొందరు రూ.200 నుంచి రూ.26888 దాకా చెల్లిస్తున్నారు. కానీ కొందరు పెట్టుబడుదారులు ఇదంతా నమ్మశక్యం లేదంటూ తాము కట్టిన డబ్బులే తిరిగి ఇవ్వాలని యాప్‌లో చేర్పించిన వారిని అడిగితే సరైన సమాధానం రావడం లేదని వాపోతున్నారు. దీనిపై సైబర్ సెక్యూరిటీ విభాగంలో ఫిర్యాదు చేసేందుకు బాధితులు సిద్ధమవుతున్నారు.

నల్లసూర్యులకు మళ్లీ నిరాశే

- ఆదాయ పన్ను మాఫీ ఇక అందని ద్రాక్షే
- ఈ బడ్జెట్‌లోనూ కార్మికులకు మొండి చెయ్యి
- పెర్క్స్‌పై రీయింబర్స్‌మెంట్‌కు డిమాండ్



గనిలో పనిచేస్తున్న కార్మికులు (ఫైల్)

శ్రీరాంపూర్: ఈసారీ కేంద్ర బడ్జెట్‌లో బొగ్గు గని కార్మికులకు నిరాశే మిగిలింది. కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కార్మికుల ఆదాయ పన్నుకు సంబంధించి తీపి కబురు ఉంటుందని ఆశించిన కార్మికవర్గానికి కేంద్రం మొండిచెయ్యి చూపింది. దీంతో ఆదాయపన్ను మాఫీ అందని ద్రాక్షేనని కార్మికులు భావిస్తున్నారు. ప్రాణాలు పణంగా పెట్టి బొగ్గు ఉత్పత్తి చేస్తూ దేశానికి వెలుగులు అందిస్తున్న కార్మికులు సంపాదించిన సొమ్ములో 30శాతం ఆదాయ పన్నుకే పోతోంది. 8వ వేతన ఒప్పందం నుంచి కార్మికుల వేతనాలు పెరిగాయి. క్రమేణా 9వ, 10వ, 11వ వేజ్‌బోర్డులో కూడా మరింత పెరిగాయి. 8వ వేతన ఒప్పందం నుంచే కార్మికులు ఆదాయ పన్ను స్లాబ్ పరిధిలోకి వచ్చారు. ఇప్పుడు ప్రతీ ఉద్యోగి ఆదాయ పన్ను చెల్లించే స్లాబ్‌లో ఉన్నారు. వేతనాలు ఎక్కువని కొందరు భావించినా వారు గనిలోకి దిగి పని చేయడం వల్ల వచ్చే కీళ్ల నొప్పులు, నడుం నొప్పులు, ఇతర జబ్బుల చికిత్సలకే భారీ ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇక ఏదైనా మిగిలుతుందోనని మురిసిపోయే లోపు ఆదాయ పన్ను కోత పడుతోంది.

1వ కేటగిరీ కార్మికుని తప్పని పోటు..

బొగ్గుగనుల్లో కింది కేటగిరీలో ఉండే 1వ కేటగిరి కార్మికులు కూడా ఆదాయ పన్ను చెల్లిస్తున్నారు. ప్రతీ కార్మికునికి ఏడాదికి కనీసం రూ.6 లక్షలు మించి వేతనం పొంది ఆదాయపన్ను స్లాబ్‌లోకి వస్తున్నారు. దీనికి తోడు కార్మికులు పొందే సదుపాయాలు, అలవెన్సులను కూడా సముపార్జనగా చూపి పన్ను వసూలు చేస్తున్నారు. లాభాల వాటా, దీపావళి బోనస్‌లోనూ పన్ను పోటు తప్పడం లేదు. ఇక సీనియర్ కార్మికులు, పై కేటగిరి, టైంరేటెడ్ కార్మికులు, ఓసీసీల్లో పని చేసే ఆపరేటర్లు, ఇతర పై స్థాయి కేటగిరి కార్మికులు సంపాదించే ఆదాయంలో 20 శాతం పన్ను చెల్లించాల్సి వస్తోంది.

హామీలే.. ఆచరణ లేదు..

కార్మికులు ఆదాయ పన్ను మాఫీ కోసం ఏళ్లుగా పోరాడుతున్నారు. ప్రతీ ఎన్నికల్లో నేతలు కార్మికులకు ఆదాయ పన్ను మాఫీ చేస్తామని కొందరంటే, తాము కొట్లాడుతామని మరికొందరు అంటూ ఓట్లు వేయించుకుంటున్నారు. కేంద్రంలో అధికారంలో ఉండే పార్టీలే చొరవచూపితేనే సాధ్యమవుతుందని, వారి చేతుల్లోనే ఈ సమస్య ఉందంటూ రాష్ట్ర స్థాయి పార్టీలో పేర్కొంటున్నారు. అన్ని పార్టీలకు ఇది రాజకీయ అస్త్రంగా మారిందని కార్మికులు వాపోతున్నారు. కనీసం కోలిండియాలోనైనా అలవెన్సుల(పెర్క్స్)పై పడే ఆదాయపన్నులను అక్కడి సంస్థలు రీయింబర్స్‌మెంట్ చేస్తున్నారు. సింగరేణిలో అది కూడా లేదని, రాష్ట్ర ప్రభుత్వమైనా ముందుకు రావాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

రిస్క్ సెక్టార్‌గా గుర్తించాలి..

దేశ సరిహద్దులో ఉండే ఆర్మీతోపాటు త్రివిధ దళాల్లో జవాన్లు, పై స్థాయి అధికారులకు ఆదాయ పన్ను మాఫీ ఉంటుంది. ప్రాణాలు పణంగా పెట్టి దేశం కోసం పని చేస్తున్నారని రిస్క్ సెక్టార్‌గా గుర్తించి పన్ను మాఫీ చేస్తున్నారు. కార్మికులు గనిలోకి దిగి పని చేసి ఇంటికి తిరిగి వస్తారనే గ్యారంటీ కూడా ఉండదు. ప్రకృతితో పోరాడే వారి వృత్తి నిత్య ప్రాణసంకటమే. నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్న బొగ్గుగని కార్మికులను రిస్క్ సెక్టార్‌గా గుర్తించి పన్ను మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరాశే మిగిలింది



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ బొగ్గు గని కార్మికులకు నిరాశే మిగిల్చింది. గనులపైకి వచ్చి ఎన్నికల్లో ప్రచారం చేసిన బీజేపీ నేతలు కేంద్రంలో తమ పార్టీ అధికారంలోకి వస్తే ఆదాయ పన్నుమాఫీ చేయిస్తామని నమ్మించి ఓట్లు వేసుకున్నారు. ప్రతీ పార్లమెంట్ ఎన్నికల ముందు ఇదే హామీతో ప్రధాన పార్టీలు ఓట్లు దండుకొని చివరికి మోసం చేస్తున్నాయి. కనీసం బొగ్గు పరిశ్రమకు ఎలాంటి రాయితీలు, ప్రోత్సాహకాలు ఈ బడ్జెట్‌లో లేవు.

– కే.వీరభద్రయ్య, ఏఐటీయూసీ డెప్యూటీ జనరల్ సెక్రెటరీ

పట్టించుకోలేదు



కేంద్రం బొగ్గుగని కార్మికులను ఏమాత్రం పట్టించుకోలేదు. ఏళ్లుగా ఆదాయ పన్ను మాఫీ కోసం కార్మికవర్గం పోరాటం చేస్తున్నారు. మాఫీ అటుంచి కనీసం రాయితీ లేదా, స్లాబ్‌లో మార్పులైనా చేయలేదు. కేంద్రవైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

– శంకర్‌రావు, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన కారు

- దంపతులకు తీవ్రగాయాలు



గాయాలపాలైన రవికుమార్



గాయాలపాలైన అనూష జ్యోతి

బెల్లంపల్లిరూరల్: ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న ఘటనలో దంపతులకు తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. తాళ్లగురిజాల ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం... కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన గొర్లపూడి రవికుమార్, అనూష జ్యోతి దంపతులు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని బంధువుల ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లారు. మంగళవారం కారులో కాగజ్‌నగర్ వస్తుండగా బెల్లంపల్లి మండలం కన్నాల జాతీయ రహదారి తిరుమల హిల్స్ వద్ద యూటర్న్ తీసుకుంటున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. దీంతో కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. బెల్లంపల్లిరూరల్ సీఐ అఫ్జలొద్దీన్, తాళ్లగురిజాల ఎస్సై నరేష్, టూటౌన్ ఎస్సై రమేశ్ ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం మంచిర్యాలకు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. ట్రాక్టర్ డ్రైవర్ రాజయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

317 జీవో ఉపాధ్యాయుల వంతు..!

- 91 మంది టీచర్ల సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- స్పౌజ్, మెడికల్, మ్యూచువల్, స్థానికత అంశాలే కీలకం



సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన ఉపాధ్యాయులు

మంచిర్యాలఅర్బన్: టీచర్ల బదిలీలు, పదోన్నతులు పూర్తి చేసిన ప్రభుత్వం జీవో 317పై దృష్టి సారించింది. జిల్లాల ఆవిర్భావం తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయులను విభజించే క్రమంలో అప్పటి ప్రభుత్వం జారీ చేసిన 317 జీవోపై ఫోకస్ పెట్టింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టీచర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు వేగవంతం చేసింది. సొంత జిల్లా వదిలి వేరే జిల్లాకు వెళ్లాల్సి రావడంతో ఉపాధ్యాయులు ఆందోళన బాట పట్టారు. స్థానికత, కుటుంబ నేపథ్యం, స్పౌజ్, మెడికల్ ఇతరత్రా కేటగిరీలను తీసుకోకపోవడంతో బాధితులు నిరసనలు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం జిల్లా నుంచి ఇతర జిల్లాకు వెళ్లే 91 మంది టీచర్లకు సంబంధించిన ధృవపత్రాల పరిశీలన చేపట్టారు. ఇదివరకు దరఖాస్తు చేసుకున్న స్పౌజ్, మెడికల్, మ్యూచువల్, ఇతర ఉపాధ్యాయుల స్థానికతపై క్షుణ్ణంగా పరిశీలించారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తికాగానే ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

జీవోతో పడరాని పాట్లు

317 జీవోతో ఉద్యోగ, ఉపాధ్యాయులు పడరాని పాట్లు పడ్డారు. స్థానికులు ఇతర జిల్లాకు వెళ్లాల్సి రావడంతో ఆందోళన చెందారు. భర్త ఒకచోట.. భార్య మరోచోటకు బదిలీ ఉత్తర్వులు జారీ కావడంతో ఉద్యమాలు చేస్తువచ్చారు. ఇందులో కొందరు స్పౌజ్ కేటగిరీ కింద, మరికొందరు మ్యూచువల్ బదిలీ కింద స్వస్థలాలకు తిరిగి వెళ్లగా చాలామంది ఆయా జిల్లాల్లోనే మిగిలిపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సబ్‌కమిటీని ఏర్పాటు చేయడం.. అప్పీలుకు అవకాశం కల్పించడం చకాచకా సాగింది. ప్రస్తుతం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టడంతో ఉపాధ్యాయుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

అప్పీలు చేసుకున్నవారు 91 మంది..

మంచిర్యాల జిల్లాలో విధులు నిర్వహించే 91 మంది ఉపాధ్యాయులు ఇతర జిల్లాలకు వెళ్లేందుకు అప్పీలు చేసుకున్నారు. స్థానికత, స్పౌజ్, మ్యూచువల్, మెడికల్ కేటగిరీతో పాటు ఇతరులు దరఖాస్తు చేసుకోగా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఖాళీలు, క్యాడర్ స్ట్రెంత్ సరిపోవటంతో వందమంది లోపు ఇతర జిల్లాల నుంచి రావడానికి అవకాశం ఉంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన దాదాపు 70 మందికి పైగా టీచర్లు మంచిర్యాలకు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. మంచిర్యాల జిల్లా నుంచి ఆదిలాబాద్‌కు 37, నిర్మల్‌కు 25, సూర్యాపేట్‌కు ఒక్కరు, కరీంనగర్‌కు నలుగురు, ఆసిఫాబాద్‌కు నలుగురు, హన్మకొండకు ఐదుగురు, నల్గొండకు ఇద్దరు, కామారెడ్డి, వరంగల్, జగిత్యాల, మల్కాజిగిరికి ముగ్గురు చొప్పున, నిజామాబాద్‌కు ఒక్కరు వెళ్లేందుకు అప్పీలు చేసుకున్నారు. ఇందులో ఎంతమంది వెళ్తారో.. ఇక్కడ ఎంతమంది ఉంటారో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అనంతరం తేలనుంది.

వ్యాధుల నివారణకు చర్యలు



ఫాగింగ్ చేయిస్తున్న కమిషనర్ చిట్యాల సతీష్

సాక్షి ఎఫెక్ట్..

నస్పూర్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ చిట్యాల సతీష్ అన్నారు. సోమవారం 'సాక్షి' నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమంలో పలువురు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కమిషనర్ చైర్మన్ సురిమిల్ల వేణుతో కలిసి మంగళవారం పట్టణ పరిధిలోని పలు వార్డులలో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. డ్రెయినేలలో పూడికలను తీయించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అగల్‌డ్యుటి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతిగృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ

మంచిర్యాలటౌన్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వసతి గృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అనిత అన్నారు. పట్టణంలోని పలు వసతి గృహాల్లో మంగళవారం దోమల మందు పిచికారీ చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు.

రైతులకు పరిహారం చెల్లించాలి



పంటలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

కోటపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ప్రాణహిత నదీ పరీవాహక ప్రాంతాల్లో పంటలు నీట మునిగిన రైతులకు ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ డిమాండ్ చేశారు. మంగళవారం సిర్సా గ్రామంలో నీట మునిగిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. వెంచపల్లి నుంచి దేవులవాడ వరకు వరదలు వచ్చి కొన్ని వేల ఎకరాల్లో పంటలు నీటమునిగి వందల మంది రైతులు నష్టపోయారన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పార్టీ మండల అధ్యక్షుడు రామన్న, నాయకులు పున్నం చందు, కొండపాకచారి, జాడి తిరుపతి, శ్రీపాల్, శివకృష్ణ పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ వెరిఫై అంటూ మోసం

మంచిర్యాలక్రైం: ఎలక్ట్రిసిటీ వెరిఫై చేయాలంటూ సైబర్ క్రైమ్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని సీఐ బన్సీలాల్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ కాలనీకి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ వనం రఘు మొబైల్‌కు ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్(టీజీఎస్‌పీడీసీఎల్) నుంచి ఒక లింకు రావడంతో ఓపెన్ చేశాడు. వెంటనే సైబర్ నేరగాడు ఫోన్ చేసి మీ యొక్క ఎలక్ట్రిసిటి బిల్ వెరిఫై చేస్తున్నామని, ఇప్పుడు మీకు వచ్చిన ఓటీపీ చెప్పాలని సూచించాడు. రఘు ఓటీపీ చెప్పగానే అతని బ్యాంకు అకౌంట్ నుంచి రూ. 5.23 లక్షలు మాయమయ్యాయి. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.